



గోనెగండ్లలో ఉల్లి పంట సాగు చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ట్రూ అప్ ఉపసంహరణ, సెకీ ఒప్పందం రద్దు చేయకపోతే

మరో బషీర్‌బాగ్ ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- ఏపి ఇఆర్‌సి ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా
- ఇఆర్‌సి ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేత



ఈఆర్‌సి ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ట్రూ అప్ ఛార్జీల వసూలను ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని లేకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు హెచ్చరించారు. మరో ట్రూ అప్ ఛార్జీల వసూలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన సందర్భంగా ట్రూ అప్, సర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపి ఇఆర్‌సి ఛైర్మన్ పివికే రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ టిడిపి కూటమి నాయకులు ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను వేయబోమని, స్మార్ట్ మీటర్లను పగలకొట్టండని ప్రచారం చేసి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్ని ప్రస్తుతం చాలా వేగంగా అమలు చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించడం అనుసమానం. 2019-24 సంవత్సరాలలో వినియోగించుకున్న విద్యుత్ పై మళ్లీ ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.12,717 కోట్ల భారాల ప్రతిపాదనలు పొందుపరిచారు, 2022-23 సంబంధించి ఇప్పటికే 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీలు మోపి వసూలు చేశారని తెలిపారు. ఇప్పటికే అనేక సార్లు ట్రూఅప్ ఛార్జీలు వేసి ప్రజల నడ్డి విరగొట్టారన్నారు. ఇపుడు మరొకసారి రూ.12,717 కోట్లు భారం వేయడానికి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రావడాన్ని సిపిఎంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదన్నారు. ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.12,717 కోట్లు భారం వేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. పంపిణీ సంస్థ విద్యుత్ మిగులు భవిష్యత్ అవసరాలపై తప్పుడు తడకలతో అంచనాలు రూపొందించడం సరియైంది కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండి.అంజిబాబు, నారాయణ, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అలివేలు, అరుణ, నగేష్ విజయ రామాంజనేయులు, గురు శేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ బి.జె.బ్రహ్మ

ప్రజాశక్తి - కోడుమూరు/గోనెగండ్ల

రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ బి.జె.బ్రహ్మ తెలిపారు. మంగళవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో, గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె, గోనెగండ్ల గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉల్లి పంటల సాగు, ఉత్పత్తి, విస్తీర్ణ అంశాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.జె.బ్రహ్మ రైతులతో మాట్లాడుతూ ఉల్లి పంటను ఎప్పటి నుండి సాగు చేస్తున్నారు..? ఏ సీజన్‌లో పండిస్తున్నారు..? ఎలాంటి రకాలు పండిస్తున్నారు..? ఎకరానికి ఎంత ఆదాయం వస్తుంది..? మార్కెట్‌లో ధర ఏ విధంగా ఉంది.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట పండించే సమయంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.? ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలని రైతులను ఆరా తీశారు. పంట వేసే సమయానికి ప్రభుత్వం నుండి నాణ్యతతో కూడిన విత్తనాలు ఇప్పించాలని, పండించిన పంటకు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కేంద్ర సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు వారు నోట్ చేసుకొని పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సభ్యులు మనోజ్, రాజీవ్ కుమార్, హేమంగా భార్గవ్, శరవణన్, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారి కార్యాలయం నుండి ఉప సంచాలకులు జమదగ్ని, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

లారీ ఢీ కొని ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన కర్నూలు నగర శివారులోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. కర్నూలు జిల్లా కల్లూరు మండల కేంద్ర పరిధిలోని కేశవ గ్రాండ్ హోటల్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులను లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మృతులు వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ నారాయణ (65), కల్లూరు మండలం ఎ.గోకులపాడుకు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (50), కల్లూరుకి చెందిన వెంకట రామిరెడ్డి (40)గా గుర్తించారు. శ్రీనివాసులుకు చెందిన లారీ రిపేరీ కావడంతో పక్కకు ఆపి నలుగురూ రోడ్డు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ అసంతృప్తి

- విద్యార్థులకు రుచిగా వండి పెట్టాలని ఆదేశం



విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోవడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం తయారు చేయించి వడ్డించాలని పాఠశాల హెచ్‌ఎం నజీర్‌ను ఆదేశించారు. మంగళవారం దేవనకొండలో అంగనవాడీ కేంద్రం-6, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పిల్లలను ఏమి తిన్నారని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని చాలా శుభ్రంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఇలాగే ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కిచెన్ గదిని పరిశీలిస్తూ కోడిగుడ్లు స్టాక్ వచ్చినపుడు వాటిని చెక్ చేసుకొని తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు పిల్లలకు పాలు ఇస్తున్నారా అని కలెక్టర్ అంగన్వాడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో కూడా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బాలికలతో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో చదవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. భోజనం రుచిగానే పెడుతున్నారా..? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంట గదిని పరిశీలిస్తూ రాగి జావ కొంచెమే చేశారెందుకని ప్రశ్నించారు. పిల్లలు కొంతమంది మాత్రమే తాగుతున్నారని సిబ్బంది సమాధానం ఇచ్చారు. విద్యార్థులందరికీ సరిపడేలా రాగి జావ తయారు చేసి అందరూ తాగేలా పిల్లలను ఒప్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన రుచి చూసి రుచిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యా శాఖాధికారి తరచుగా పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించాలని పాఠశాల హెచ్‌ఎం నజీర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జ్యోతి, ఎంఈఓలు తిమ్మారెడ్డి, విజయ నిర్మల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో విఫలం

- ప్రాజెక్టుల పూర్తిలో పాలకులు నిర్లక్ష్యం - 46 వేల ఎకరాలకు సాగునీరిచ్చే వరకూ పోరాటం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ - బైక్ జాతాకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సంఘీభావం

ప్రజాశక్తి- దేవనకొండ

జిల్లాలో నిత్యం కరువు కాటకాలతో విలవిలలాడుతున్న పశ్చిమ ప్రాంత రైతుల పొలాలకు సాగునీరు అందించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ విమర్శించారు. సాగునీటి సమస్య పరిష్కారానికి సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తెర్నేకల్ గ్రామం నుండి చేపట్టిన బైక్ జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. మండలంలోని హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 46 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం, పంట కాలువల నిర్మాణాలు పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండలంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పెండింగ్ పంట కాలువల నిర్మాణాలకు నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు పంపుతున్నా మంజూరు చేయించడంలో పాలకులు బాధ్యతగా తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులైన వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ నిర్మాణాలు పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అతివృష్టితో అపార పంట నష్టం సంభవించినప్పటికీ రైతులను ఏమాత్రం ఆదుకోలేదన్నారు. హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు ద్వారా చెరువులకు నీటి మళ్లింపు చేస్తామని చెప్పుకోవడం ప్రకటనలకే పరిమితమైందన్నారు. దేవనకొండ మండలం చుట్టూ సాగునీటి వనరులు ఉన్నప్పటికీ పంట పొలాలకు అందించలేని పరిస్థితి ఉందన్నారు. మండలంలో కరివేముల, తెర్నేకల్లు, కప్పట్రాళ్ల గ్రామాల మధ్యన హంద్రీనీవా ప్రధాన కాలువ పెండింగ్ పనులు ఉండడం వలన మండలానికి సాగునీరు సక్రమంగా రావడం లేదని పేర్కొన్నారు. వెంటనే పంట కాల్వల నిర్మాణం చేపట్టాలని, హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మండల రైతాంగం డిమాండ్ మేరకు గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు కాలువ తీసుకురావాలని కోరారు. తద్వారా మండలానికి మరో 10 వేల ఎకరాలకు సాగునీరు, చెరువులకు నీళ్లు మళ్లించే అవకాశం ఉందన్నారు. బుధవారం చేపట్టే తహాశీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో మండల ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 20వ తేదీన పత్తికొండ ఆర్డిఓ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని కోరారు.

బైక్ జాతాకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సంఘీభావం

సిపిఎం చేపట్టిన బైకు జాతాకు ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి, వైసిపి నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏడాదిన్నర పాలనలో రాష్ట్రాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోగా, అప్పుల ఊబిలో నెట్టారన్నారు. ఉల్లి, పత్తి, మిరపకు ఎలాంటి మద్దతు ధర లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు వైపు నష్టపోతున్నారని చెప్పారు. రైతుల పక్షాన పోరాడే సిపిఎంకు అన్ని విధాలుగా మద్దతు తెలిపి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి, జిల్లా కోశాధికారి మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్, ఎంపిపి భర్త లుముంబా, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి చాప వీరన్న, రాఘవేంద్ర, సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్, సూరి, పరమేశు, మహబూబ్ భాష, బజారి, పాండురంగడు, నాయకులు, సుధాకర్, నాగేంద్ర, లోకయ్య, సునీల్, రాయుడు, రంగన్న, లింగన్న, పురుషోత్తం, భాస్కర్, వెంకటేష్, పరాక్రమ రాముడు, సుభాన, దొడ్డప్ప, రాయుడు, రవీంద్ర, లింగన్న, నాగేంద్ర, లోకయ్య, లక్ష్మిరెడ్డి, బడేసాబ్, కౌలుట్లయ్య రాజు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ జాతాను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



జాతాకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి



బాలదంత సురక్షలో పాల్గొన్న మంత్రి భరత్

ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

- రాష్ట్ర మంత్రి భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. మంగళవారం నగరంలోని సంకల్ బాగ్‌లోని విశ్వక్ గార్డెన్స్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుజరాత్ కమ్యూనిటీ వారు బాలదంత సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మంత్రి భరత్ ముఖ్యఅతిథిగా హాజరయి విద్యార్థులతో మాట్లాడారు. రోజూ ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవడం అవసరమన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో వ్యాయామానికి కూడా చాలా ప్రాధాన్యత ఉందన్నారు. రోజూ వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. సోమిశెట్టి శ్రీకాంత్, నభూ షా, డాక్టర్ శ్వేత, డాక్టర్ సునీత, డాక్టర్ దివ్య, రజిత, విభ, సేజన్, ఫర్జానా పాల్గొన్నారు.

విస్తరణ పనులు వేగవంతం

- కమిషనర్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనులు మరింత వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం, ఆర్‌అండ్‌బి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 180 ఆస్తుల్లో ఇప్పటివరకు 50 మంది యాజమానులు ముందుకొచ్చి అవసరమైన పత్రాలు సమర్పించా రని తెలిపారు. మిగిలిన యాజమానులు త్వరగా సహకరిస్తే విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ప్రభావితులకు టిడిఆర్ బాండ్ల జారీ, భవన నష్టపరిహారం అందజేతను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బి ఎంఇ సునీల్, డిఇ ఫణిరామ్, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, కార్పొరేటర్లు పరమేష్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

పరిధి దాటి యాంటీ మైక్రోబియల్స్ వాడకం అనర్థం

- కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

యాంటీ మైక్రోబియల్స్‌ను పరిధి దాటి ఉపయోగిస్తే మానవ ఆరోగ్యంతో పాటు, జంతువుల ఆరోగ్యం, పర్యావరణం కూడా దెబ్బతింటుందని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. మంగళవారం కర్నూలు మెడికల్ కళాశాలలో మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ మైక్రోబెల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్)పై ఈ నెల 18 నుండి 24 వరకు నిర్వహించే అవగాహన వారోత్సవాలను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... యాంటీ మైక్రోబెల్ రెసిస్టెన్స్ అంటే బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, పరాన్న జీవులు మితిమీరిన మందులు వాడటం వల్ల మందులకు స్పందించడం మానేస్తే అంటువ్యాధులకు చికిత్స చేయడం కష్టతరమవుతుందని తెలిపారు. వ్యాధుల వ్యాప్తి, అనారోగ్యం, మరణశాతాన్ని పెంచుతుందని, ప్రతి ఒక్కరూ యాంటీ మైక్రోబెల్స్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అవసరం మేరకే వాటిని వాడాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మందులకు వాడకం అవసరం మేరకు, నిర్దిష్ట స్థాయిలో ఉండాలన్నారు. కెఎంసి వైస్ ప్రిన్సిపల్, మైక్రో బయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రేణుకాదేవి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధా కుమారి, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సావిత్రి, ఫార్మా కాలేజీ హెచ్‌ఒడి డాక్టర్ రాజేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివ బాల పాల్గొన్నారు.



వారోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ చిట్టి నరసమ్మ

ఆస్పత్రిలో అందుబాటులోకి అన్ని సేవలూ

- అభివృద్ధికి రూ.3 కోట్లు విడుదలయ్యాయి
- ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల సేవలనూ అందుబాటులోకి తెస్తున్నామని ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్ రే విభాగాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో చిన్నపాటి సమస్య వచ్చినా కర్నూలుకు రిఫర్ చేసే పరిస్థితులు ఉండేవన్నారు. ఎమ్మెల్యేగా తాను బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నరలో ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఇకపై రోగులు ఎంతటి క్లిష్టమైన సమస్యతో వచ్చినా ఇక్కడే చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఆస్పత్రి ఆధునీకరణకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఆ పనులు కూడా చేపడతామని చెప్పారు. ప్రస్తుతం వైద్యుల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. పేదలకు ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందాలన్న ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆస్పత్రి కమిటీ సభ్యులు సాంబశివారెడ్డి, సురేష్ కుమార్, బత్తిని లోకనాథ్, ఆస్పత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ కల్పన, డాక్టర్ హారిక, మణిదీప్ ఉన్నారు.

జిల్లాస్థాయి అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - సిబెళగల్

సిబెళగల్‌లోని సచివాలయం-2లో జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి మంగళవారం తనిఖీ చేపట్టారు. పరిషత్ ముందు నిలిచిన దుకాణ సముదాయం పనులను చేపట్టేలా దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల ఈకేవైసి పురోగతి సాధించాలని, ఆన్‌లైన్ హాజరును క్షేత్రస్థాయిలో చేపట్టాలని సూచించారు. డిపిఒ భాస్కర్ బెళగల్‌లోని పలు వీధులను పరిశీలించి, ఐవిఆర్‌ఎస్ సర్వేను క్షేత్రస్థాయిలో చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలు పకడ్బందీగా చేయాలని కోరారు. ఎంపిడిఒ రాణెమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ మహేశ్వరి, సర్పంచి పాండురంగన్న, కార్యదర్శులు సునీలా రాణి, శ్యామల పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

మాదక ద్రవ్య రహిత సమాజంగా మారుద్దాం : కమిషనర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొండారెడ్డి బురుజు వద్ద ఉద్యోగులు, సిబ్బందితో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ... కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ గొప్ప ప్రాజెక్టు అని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని చెప్పారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి పౌరుడి బాధ్యతగా పేర్కొన్నారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఒ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

దొంగతనానికి పాల్పడిన నిందితున్ని పోలీసులు అరెస్టు చేసినట్లు కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం ఆయన కర్నూలు డిఎస్పీ కార్యాలయంలో కోడుమూరు సిఐ తబ్రేజ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. డిఎస్‌పి మాట్లాడుతూ సెప్టెంబర్ 25న బెళగల్ మండలం తిమ్మదొడ్డి గ్రామంలో తెలుగు చిన్నారెడ్డి వ్యక్తి ఇంట్లో దొంగతనం జరగ్గా బాధితుని ఫిర్యాదు మేరకు బెలగల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. కోడుమూరు సిఐ తబ్రేజ్, సి.బెళగల్ పోలీస్ స్టేషన్ ఎస్సై యు.వేణు గోపాల్ రాజు ఆధ్వర్యంలో, ఎఎస్సైలు నాగయ్య, హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, కానిస్టేబుల్ లు మల్లికార్జున, సుధాకర్, భాస్కర్, సుదర్శన్, సత్యరాజులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నేరానికి పాల్పడిన ముద్దాయి గిర్ని వెంకటేష్‌ని మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో సి.బెళగల్ గ్రామం నుండి చింతామానుపల్లి గ్రామానికి పోవు దారిలో ఉన్న గుట్టల నాగమ్మ గుడి వద్ద సి.బెళగల్ పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. వెంకటేష్ నుండి సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు, సుమారు 55 తులాల వెండి, లక్ష రూపాయల నగదు స్వాధీనపరచుకున్నారు. రికవరి చేసిన ప్రాపర్టీని సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగిస్తామని డిఎస్‌పి తెలిపారు. బెళగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ



ఆటో జాతాలో మాట్లాడుతున్న నాయకులు కెవి.నారాయణ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- 20న తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మండలంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కల్లూరు మండలంలో ఆటో జాతా నిర్వహించారు. ఆటో జాతను నాయకులు కెవి.నారాయణ ప్రారంభించారు. మంగళవారం ఆటో జాతాను ముగించిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై గ్రామగ్రామాన కరపత్రాలు పంచుతూ ఈ నెల 20న తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలోని చెరువులకు నీళ్లు నింపాలని, చిన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌కు గాజులదిన్నె ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు నింపాలని, సాగు భూమికి పట్టాలు ఇవ్వాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు స్థలాలు ఇవ్వాలని, గ్రామాలకు రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎ.కృష్ణ, మండల నాయకులు కె.మధు, కేశాలు, భాస్కర్ పాల్గొన్నారు.

సాగు, తాగునీటి కోసం 20న సిపిఎం మహాధర్నా

ప్రజాశక్తి - మద్దికేర

రైతుల సాగు, తాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరిగే జీపు జాతను జయప్రదం చేయాలని క్లస్టర్ సిపిఎం నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో మద్దికేర, బురుజుల, పెరవలి, అగ్రహారం గ్రామాలలో కరపత్రాలను రైతులకు పంచుతూ జీపుజాత కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వెనుకబడ్డ ప్రాంతమైన మద్దికేర మండల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి ప్రకతి నిరాదరణకు గురవుతూ కరువు ఉండటంవల్ల పిల్లాపాపలతో సుధూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తుందన్నారు. మండలంలో అందుబాటులో హంద్రీనీవా కాలువ ఉన్నప్పటికీ సాగు త్రాగునీరు కు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఇప్పటికీ అనేక గ్రామాల్లో సురక్షిత మంచినీరు సౌకర్యం లేదన్నారు. పలు సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆర్డిఓ ఆఫీస్ దగ్గర జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని మండల ప్రజలకు పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించి రూ.200 రోజులు పని దినాలు అర్హులైన ప్రజలందరికీ రేషన్ కార్డులు, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మద్దికేర మండలం కార్యదర్శి రాముడు, పత్తికొండ సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర, సిఐటియు పత్తికొండ మండల అధ్యక్షులు గోపాల్ పాల్గొన్నారు.



దేవనకొండ : తెర్నేకల్లులో కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

పేదలు వైద్య సేవలు పొందాలంటే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. మంగళవారం మండలంలోని తెర్నేకల్లు, నల్లచెల్లిమల గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఉచిత వైద్య విద్య అందించాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతుందని విమర్శించారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, వైసిపి జిల్లా కోశాధికారి మధుసూదన్ రెడ్డి, జడ్‌పిటిసి శేషప్ప, ఎంపిపి భర్త అయ్యన్న, సర్పంచి అరుణ్ కుమార్, ఎంపిటిసి నాగేంద్ర, శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు జుబేర్, మాజీ ఎంపిటిసి చావ వీరన్న, రాఘవేంద్ర, వైసిపి నాయకులు హంపి రెడ్డి, కొత్తపేట బాబు, పల్లె దొడ్డి చంద్రన్న, వెంకటేశ్, పెసవాడ రామాంజనేయులు, పులి నరేష్, కటికె కృష్ణ, బోయ అంజి పాల్గొన్నారు. **ఆదోని** తలమానికమైన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేట్ పరం కాకుండా కాపాడుకుందామని వైసిపి నాయకులు ప్రయాజ్, ఏసోబు తెలిపారు. భీమాస్ కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు అన్ని వర్గాల ప్రజలతో సంతకాలు సేకరించారు.

నిబంధనలు సడలించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పత్తి కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి సిసిఐ నిబంధనలు సడలించి రైతుల దగ్గరున్న పత్తినంతా కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. మంగళవారం ఆదోనిలోని విష్ణుశ్రీ ఎంటర్‌ప్రైజెస్ ఫ్యాక్టరీలో పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య మాట్లాడారు. ప్రభుత్వం కొన్ని సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు స్లాట్ బుక్ చేసుకోవడం ఇబ్బందిగా ఉందని, నాణ్యత పేరుతో సిసిఐ అధికారులు పత్తిని పూర్తిగా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. బయట మార్కెట్‌లో ప్యాక్టరీల్లో తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలలోపు ధర ఉందని తెలిపారు. సిసిఐ కేంద్రాల్లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని, వీటిని తక్షణమే అరికట్టాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ... పత్తిలో తేమ శాతం 14 వరకు ఉన్నప్పటికీ పత్తిని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. పత్తి పంటను తీసుకొచ్చే రైతులను వెనక్కు పంపకుండా పత్తినంతా కొనుగోలు చేయాలని చెప్పారు. కలెక్టర్ చెప్పిన తర్వాత కూడా సిసిఐ అధికారులు నాణ్యత పేరుతో కొంతమంది రైతులను వెనక్కి పంపారు. మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులను త్వరలో తొలగిస్తామని చెప్పారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న, అయ్యప్ప, మండల కమిటీ సభ్యులు శేఖర్, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

సరైన మోతాదులో మందులు వినియోగించాలి

- ఎఒ సరిత

ప్రజాశక్తి - నందవరం

రైతులు పంటల సస్యరక్షణకు సరైన మోతాదులో క్రిమిసంహారక మందులను వినియోగించాలని ఎఒ సరిత తెలిపారు. మంగళవారం ఆమె టి.సోమల గూడూరు, పొనకలదిన్నె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది', భూమాత సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు పూత దశలో ఎకరాకు 200 కిలోల చొప్పున జిప్సం, మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఈమామెక్టిన్ బెంజోమెట్, మిరపలో రసం పీల్చే పురుగుల నివారణకు జిగురు అట్టలు ఎకరాకు 10 పసుపు రంగు, 10 నీలం రంగు అట్టలు పొలంలో అక్కడక్కడ అమర్చుకోవాలని తెలిపారు. సిసిఐ ద్వారా పత్తి ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తామని, రైతులు తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఆర్‌ఎస్‌కెల సిఎం యాప్‌లో మిల్లులను స్లాట్ బుకింగ్ చేసుకొని అమ్ముకోవాలని వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ సరిత

ట్యాంకు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - ఆదోని

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సిరి సూచించారు. మంగళవారం నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదోని శివారులో బసాపురం సమీపంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో జరుగుతున్న పనులు మమ్మరం చేయాలన్నారు. ఎస్ఎస్ ట్యాంకుకు సంబంధించిన అన్ని మరమ్మతు పనులను నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే డిసెంబర్ చివరి నాటికి ట్యాంక్ పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు 3,110 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉందని, ప్రస్తుతం కేవలం 20 శాతం నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న వేసవిలో ఆదోని ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహశీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ నాసిర్ హుస్సేన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్లు వెంకట చలపతి, రాజశేఖర్ ఉన్నారు. అలాటే పట్టణంలోని నిర్మల్ టాకీస్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి వంటలను రుచి చూశారు. వంటల్లో సుచి, శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.



పనుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ సిరి

అధికారుల సూచనలతో మెరుగైన దిగుబడులు

ఆదోని రూరల్ : రైతులు ఉద్యానవన, వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు. మంగళవారం మండలంలోని మదిరె గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది'లో ఆమె పాల్గొని మిరప పొలాలను సందర్శించారు. అనంతరం సిసిఐ పరిధిలో ఉండే మండలంలోని విష్ణుశ్రీ జిన్నింగ్ మిల్లు, ఎన్‌డిపిఎల్ జిన్నింగ్ మిల్లు పత్తి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, జెడిఎ వరలక్ష్మి, మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, ఆదోని తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిడిపి కమిటీ చైర్మన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.మల్లికార్జున గౌడ్, సభ్యులు, ప్రాజెక్టు ఎఇ చిన్న అలీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు ఈనెల 21 నుంచి రబీ పంటలకు నీటిని విడుదల చేసేందుకు ప్రాజెక్టు కమిటీ, సభ్యులు తీర్మానించారు. ప్రాజెక్టు నీటిని విడుదల చేసే కార్యక్రమానికి శుక్రవారం హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు.



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్, సభ్యులు

కెజిబివి ప్రిన్సిపల్‌పై కలెక్టర్ ఆగ్రహం

- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని ఆహారం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి కెజిబివి ప్రిన్సిపల్ సైలీపై కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్ కెజిబివిని ఆకస్మిక తనిఖీ చేశారు. కెజిబివిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి విద్య బోధన ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గణితంలో ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే సమాధానాలు చెప్పడంతో అందరికీ ఎఫ్ఎల్ఎన్ ట్రెనింగ్ ఇవ్వాలని, ప్రాథమిక అవగాహన ప్రతి సబ్జెక్టులను కలిగించాలని హెచ్చరించారు. వంట గదిని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి మెనూ ప్రకారం వంట చేస్తున్నారా అని వంట వారిని అడిగారు. రికార్డులో ఒకటి, వారు చెప్పిన సమాధానం వేరేగా ఉండడంతో మెనూ ప్రకారం ఇవ్వకుండా మెనూ తగ్గించి 270 విద్యార్థులకు మెనూ 54 కిలోల బియ్యానికి గాను 50 కిలోల బియ్యం, 5 కిలోల 40 గ్రాముల బ్యాక్లకు గాను 3 కిలోల బ్యాక్లతో వస్తు చేసి విద్యార్థులకు పెడుతున్నారని ప్రిన్సిపల్ సైలీపై మండిపడ్డారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. మెనూలో ప్రకారం వంట చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదనపు గదుల నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యమైన మెటీరియల్‌తో నిర్మాణ పనులు చేపట్టాలని, కాలింగ్ చేయాలని తెలిపారు. విద్యార్థులకు మైదానం లేకుండే ఎలా అని ఆరా తీశారు.

సచివాలయ ఉద్యోగులపై మండిపాటు

ఆస్పరిలోని సచివాలయం-1లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై కలెక్టర్ సిరి మండి పడ్డారు. సచివాలయం ఉద్యోగుల హాజరు రికార్డు తనిఖీ చేయగా సిబ్బంది ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉండగా ఆలస్యంగా వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ... సమయపాలన పాటించడం లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. రీసర్వేలో కొన్ని తప్పులున్నాయని, పట్టా భూమి ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయని రైతులు రాముల్లయ్య, వీరేష్, పరశురాముడు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ తహశీల్దార్ రామేశ్వర రెడ్డితో మాట్లాడుతూ... కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పించుకోకుండా సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. డిఇఒ శ్యామూల్ పాల్, ఎంపిడిఒ గీతావాణి, ఎంఇఒ రాజేంద్ర ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, ఆర్ఐ రంగస్వామి, వీఆర్ఓ దాదావలి, సర్పంచి మాళిలింది రాధమ్మ, పంచాయతీ కార్యదర్శి విజయ రాజు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే బీవీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బీవీ 200కు పైగా అర్జీలు స్వీకరించారు. కొత్త పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, భూ సమస్యలు, నీటి కుళాయి కనెక్షన్లు, వీధి లైట్లు, సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, గ్రావెల్ తదితర సమస్యపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే సుమారు 4 గంటల పాటు ఓపికగా నిల్చొని ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. అర్జీలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టిడిపి మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం హుండీ లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీమఠంలో అక్టోబర్, నవంబర్ నెలలోని 34 రోజుల హుండీని లెక్కించినట్లు తెలిపారు. స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారులు, సేవా దారుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టామని చెప్పారు. నగదు రూపంలో రూ.5,41,47,228 రాగా బంగారం 80 గ్రాములు, వెండి 1610 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

ఆదోని జిల్లా కోసం అందరూ కలిసి రావాలి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లాగా ఏర్పాటు కావాలంటే రాజకీయ నాయకులందరూ ఒకే తాటిపైకి వచ్చి గళం విప్పాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. మండలం ఏర్పాటు చేయాలని పెద్దహరివాణం గ్రామస్తులు పట్టణంలోని భీమాస్ కూడలిలో చేపట్టిన దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరింది. దీక్ష శిబిరానికి టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, యువ నాయకులు మారుతి నాయుడు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని ఆదోని వాసులతో పాటు పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోనూ గళం విప్పాలని కోరారు. టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులను తాను సంప్రదించి సమిష్టి సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అదే తరహాలో వైసిపి, వామపక్షాలు, కాంగ్రెస్, జనసేన, ఇతర పార్టీల ప్రజా సంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. మండల సాధనకు పెద్ద హరివాణం గ్రామస్తులు మాత్రమే ఆందోళన చేస్తే సరిపోదని, వాటి పరిధిలోకి వచ్చే గ్రామస్తులు కూడా భాగస్వామ్యం కావాలని తెలిపారు. బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, నాయకులు అప్సర బాషా, అల్తాఫ్, రంగన్న చౌదరి, విరుపాక్షి, వెంకటేష్ చౌదరి, అయ్యన్న, వీరేష్, రాజరత్నం, బాబు నాయుడు, చిట్టి, నారాయణ, శేషిరెడ్డి, పెద్ద హరివాణం సర్పంచి రాము, బసవ, నాగరాజ్ ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్ద హరివాణం గ్రామస్తుల దీక్షలకు రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చెన్న బసవయ్య, ప్రధాన కార్యదర్శి అల్వూరు మఠం మహర్షి విజయకుమార్, చంద్ర శేఖరయ్య, పోలీసు బసవరాజ, రామలింగయ్య, వీరభద్రయ్య, సూగూరయ్య, కాటన్ వీరభద్రయ్య, కపటి మృత్యుంజయ, జె.హంపయ్య ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు.



శిబిరంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

జిల్లా ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం


- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని



సంఘీభావం తెలుపుతున్న లోకేశ్వరి

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపామని మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి తెలిపారు. మంగళవారం పట్టణంలోని భీమాస్ కూడలిలో మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో పెద్దహరివాణం గ్రామస్తులు ఏర్పాటు చేసిన దీక్ష శిబిరానికి చైర్మన్ లోకేశ్వరి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ... ఆదోనిలో విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పరిశ్రమలు ఏర్పాటు కావాలంటే జిల్లా సాధనతోనే సాధ్యమన్నారు. పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా గుర్తించాలని గ్రామస్తులు కొన్ని రోజులుగా వివిధ ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారి ఆకాంక్షను గుర్తించి పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్లు ఉస్మాన్, వసీం, మమ్ముత్తు స్వామి, వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సాయిరాం మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. **హోళగుంద** మండలం గజ్జహళ్లి గ్రామ యువకులు రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రామలింగ, ఆర్‌టిఐ యాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు వడ్డే విశ్వనాథరాజు, టిడిపి యువ నాయకులు మహ్మద్, జనసేన యువ నాయకులు హారున్ బాష, రమేష్ ఆచారి, రంగస్వామి, పంప పాల్గొన్నారు.



హోళగుంద

సమిష్టిగా పోరాడదాం

- స్థానిక ఎన్నికలలో సత్తా చాటుదాం
- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివప్రసాద్

ప్రజాశక్తి - చిప్పగిరి

వచ్చే స్థానిక ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి సత్తా చాటుదామని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కోరారు. మంగళవారం చిప్పగిరిలో వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ 19వ వర్ధంతి నిర్వహణకు వైకుంఠం జ్యోతి దంపతులు వచ్చారు. ఇన్‌ఛార్జీగా ప్రకటించాక తొలిసారి మండలానికి వచ్చిన సందర్భంగా టిడిపి నాయకులందరూ తప్పెట్లు, వాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ ఘనస్వాగతం పలికారు. చిప్పగిరి బస్టాండ్ సర్కిల్ అంతా ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారింది. అనంతరం వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. శివప్రసాద్ తండ్రి, తల్లి జ్ఞాపకాలను తలుచుకొని ఒకింత కంటితడి పెట్టారు. అనంతరం అక్కడ నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్లి భోగేశ్వర దేవాలయం దగ్గర నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. మండలంలో వైకుంఠం శ్రీరాములు చేసిన సేవలను ఎవరూ మరిచిపోరన్నారు. వారు ఎంతోమందికి రాజకీయంగా ఎన్నో ఉన్నత పదవులు వచ్చేలా కృషి చేశారన్నారు. ఆయన ఉన్నప్పుడు ఆలూరు నియోజకవర్గంలో టిడిపికి ఎదురులేదని తెలిపారు. వారి సేవా భావం, విలువలు, స్ఫూర్తి తమకు మార్గదర్శకాలని చెప్పారు. మనకు మంచి రోజులు వచ్చాయని, కార్యకర్తలు సైనికునిలా క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. మండలంలో 13 సర్పంచులు, పది ఎంపిటిసిలను గెలిపించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎన్‌టి.రామారావు స్ఫూర్తిని అందిపుచ్చుకొని ప్రతి కార్యకర్త ప్రజల పట్ల నిస్వార్థమైన అంకితభావాన్ని కలిగి పనిచేయాలని సూచించారు. సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశులు, టిడిపి సీనియర్ నాయకులు రహిమాన్, కొండా రామాంజనేయులు, బీసీ అధ్యక్షులు కిష్టప్ప, సర్పంచులు కొండా పురుషోత్తం, సురేష్, నీలకంఠ, నాయకులు వెంకటేష్, కరివేముల గోవిందు, సంగాల చంద్ర, గుమ్మనూరు అంపయ్య, తిమ్మయ్య, గుమ్మనూరు శీన, దస్తగిరి, పులికొండ, తిమ్మప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జ్యోతి, శివప్రసాద్

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య కోరారు. మంగళవారం స్థానిక రోషన్ గార్డెన్ హాల్‌లో రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలంటూ నాయకులు కోరారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, కెవివి.ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, మద్దతు ధరల సమస్య, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, నీటి కొరత తదితర అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.రామాంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కాటమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన గౌడ్, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జములయ్య, రామలింగరావు, అప్పలనాయుడు, సోమారెడ్డి, గంగాభవాని, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి టి.వీరేష్, కల్లుబావిరాజు, సిపిఐ మండల కార్యదర్శి కుమార్ స్వామి, విజయ్, పులి రాజు, కె.లింగప్ప పాల్గొన్నారు.



రైతు సమ్మేళనంలో మాట్లాడుతున్న నాయకులు



మాట్లాడుతున్న జాకీర్ హుస్సేన్

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

- వయోజన విద్యా సూపర్‌వైజర్ జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి - కోసిగి

గ్రామాల్లో ప్రతి ఒక్కరూ చదువుకుని కోసిగిని అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలని వయోజన విద్యా సూపర్‌వైజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎపిఎం సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో పొదుపు లక్ష్మి గ్రూపుల్లో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలకు, వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉల్లాస్ వయోజన విద్య కింద రెండో విడత మండలంలో 3,330 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గుర్తించిన వాలంటీర్లు స్వచ్ఛందంగా ఉచితంగా చదువు చెప్పాలని, చదువుకున్న వారిని గుర్తించి పై తరగతులకు కూడా చదువుకోవచ్చని తెలిపారు.

సిసిఐ ద్వారా వంద శాతం అమ్మకాలు

- ఎఒ గణేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ ద్వారా రైతులు వంద శాతం పత్తి అమ్మకాలు చేసుకోవచ్చని ఎఒ జీరా గణేష్ సూచించారు. మంగళవారం మండలంలోని చెట్నిహల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన భూమాత కమిటీ శిక్షణలో ఆయన మాట్లాడారు. మిరప పంటలో మెళకువల గురించి శాస్త్రవేత్త పి.సుజాత అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు బుకింగ్ చేసుకోవాలని, గతంలో 60 శాతం పత్తి అమ్మకాలు చేసుకోవడానికి అవకాశం ఉండేదని, ప్రస్తుతం వంద శాతం పత్తి అమ్మకాలు చేసుకోవచ్చని తెలిపారు. పి.సుజాత, వైఎస్.సతీష్, ఎఇఒ తిరుమల రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ్, సర్పంచి అంజినయ్య, ఎంపిటిసి రామాంజనేయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి



ఆలూరులో వ్యాసరచన పోటీలు



కౌతాళం

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని ఆశాజ్యోతి తెలిపారు. మంగళవారం ఆదోని గ్రంథాలయంలో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్, అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు సురేష్, కీరా, అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బా రెడ్డి, విజయ్ మోహన్, నరసింహులు పాల్గొన్నారు. **కౌతాళం**లోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి మధులీనా ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. **ఆలూరు** మండలంలోని మొలగవల్లి, ఆలూరు గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో మొలగవల్లి జడ్‌పి హైస్కూల్, ఆలూరు బాయ్స్-1 విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్రీడలు నిర్వహించారు. అనంతరం ఇద్దరు విద్యార్థులు సభ్యత్వం తీసుకున్నారు. గ్రంథాలయ అధికారి విజయ్ భాస్కర్, మొలగవల్లి ఉపాధ్యాయులు జమాలుద్దీన్, పీడీ నాగేంద్ర పాల్గొన్నారు.

మామను హత్య చేసిన అల్లుడు

ప్రజాశక్తి - కోసిగి



గోవిందయ్య (ఫైల్)

మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన గోవిందయ్య (45)ను ఆయన అల్లుడు కొలిమి నరసింహులు సోమవారం అర్ధరాత్రి హత్య చేసినట్లు బంధువులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... గోవిందయ్యకు తిప్పమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమార్తె వీరేశమ్మను మండలంలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన కొలిమి నరసింహులుకు ఇచ్చి వివాహం చేశారు. మద్యానికి బానిసైన నరసింహులు మద్యం సేవించినప్పుడు విచక్షణ కోల్పోయి దురుసుగా ప్రవర్తించేవాడు. మృతుడు గోవిందయ్య తన కుటుంబ సభ్యులు, నరసింహులుతో కలిసి కోల్మాన్ పేటకు బంధువుల పెళ్లికి వెళ్లారు. వివాహం మరుసటి రోజు గోవిందయ్య ఒక్కడే దుద్ది గ్రామంలోని తన ఇంటికి వచ్చారు. తర్వాతి రోజు అల్లుడు నరసింహులు కూడా దుద్ది గ్రామానికి వచ్చారు. ఇద్దరు మద్యం సేవించిన తర్వాత నరసింహులు తన మామ గోవిందయ్యతో 'నేను పెళ్లి దగ్గర ఉన్న నా భార్య వద్దకు వెళ్తాను' అని చెప్పారు. అందుకు గోవిందయ్య 'నీ భార్య దగ్గరికే పోతావో. లేక ఇంకా వేరేవారి దగ్గరికి పోతావో. నీకు మా కూతురిని ఇచ్చినప్పటి నుంచి మాకు, మా కూతురుకు మనశ్శాంతి లేకుండా చేశావు' అని అన్నారు. మంచం మీద కూర్చున్న గోవిందయ్యను నరసింహులు కిందికి తోసి, ఎదపై కూర్చొని గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతుని భార్య తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ సిఐ బి.ఎ.మంజునాథ్ మంగళవారం తెలిపారు.

బిజెపి విధానాలను తిప్పికొడదాం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

బిజెపి విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పి పట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని భీమాస్ కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దేశంలో రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, నాయకులు రామాంజనేయులు, వీరేష్, రాజు, ఎల్లప్ప, సుదర్శన్, విజయ్, రమేష్ ఉన్నారు.

శ్రీరాములు ఆశయ సాధనకు కృషి

- వైసిపి సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి

ప్రజాశక్తి - చిప్పగిరి



నివాళులర్పిస్తున్న మల్లికార్జున చౌదరి

కీర్తిశేషులు వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ ఆశయాలను, వారి సేవా భావం, విలువలు స్ఫూర్తి తమకు మార్గదర్శకాలు అని వైసిపి సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి తెలిపారు. మంగళవారం చిప్పగిరిలో వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ 19వ వర్ధంతి సందర్భంగా వారి సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. రాష్ట్ర యువత విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్, వైసిపి నాయకులు శ్రీరాములు, భీమ లింగప్ప, నాగరాజు, జహీర్, అమర్ పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డాక్టర్ శ్రీలక్ష్మి



ప్రజాశక్తి - మద్దికేర

మద్దికేర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ శ్రీ లక్ష్మి మంగళవారం చాకలి వీధి బోగప్ప బావి వీధి పరిసర ప్రాంతాల్లోని గృహలను సందర్శించి ప్రజలకు కుష్టు వ్యాధి నిర్మూలనపై ఆరోగ్య విద్య అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో కుష్టురహిత సమాజాన్ని నిర్మించాలని కోరారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగే ఎల్సిడిసి కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధులను గుర్తించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కుష్టువ్యాధి పట్ల భయపడాల్సిన అవసరం లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉన్నట్లు, అంగవైకల్య నివారణకు వ్యాధిని ముందే గుర్తించి చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, లెప్రసీ నోడల్ ఆఫీసర్ కృష్ణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ కల్కూర

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. చంద్ర శేఖర కల్కూర ముఖ్య అతిథులుగా పాల్గొని సభకు అధ్యక్షత వహించారు. డిప్యూటీ సెక్రటరీ, ఎఫ్ఎసి వి.పెద్దక్క, పి.కేశవా చార్యులు, రిటైర్డ్ హిందీ పండితులు బి.గంగిరెడ్డి, విశ్రాంత తెలుగు పండిట్ ఎం.నాగరాజు, రిటైర్డ్ ప్రిన్సిపల్ దొరస్వామి, రిటైర్డ్ సోషల్ టీచరు జాకీర్ హుస్సేన్, రిటైర్డ్ డైరెక్టర్ వజ్రాల గోవిందరెడ్డి హాజరయ్యారు. గ్రంథాలయాధికారులు ఎస్.బాషా, నషీమా బీ, సీనియర్ అసిస్టెంట్ మగ్బుల్ బాష, ఈశ్వరమ్మ, నాగ భాస్కర్ పాల్గొన్నారు. **వెల్దుర్తి** గ్రంథాలయ శాఖ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ శాఖ అధికారి తోటమ్మ అధ్యక్షత వహించారు.

మక్కా బస్సు దగ్ధం ఘటనపై ఆవాజ్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మక్కా దర్శనం అనంతరం తిరిగి వస్తున్న హైదరాబాదీయులు బస్సు దుర్ఘటనలో చనిపోవడం చాలా బాధాకరమని, హృదయాన్ని పిండేసిన ఘటనని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మక్కాను దర్శించిన అనంతరం తిరిగి వస్తున్నప్పుడు వీరు ప్రయాణం చేస్తున్న బస్సు ట్యాంకర్ ను ఢీ కొట్టిందని దాంతో ట్యాంకర్ పేలి బస్సు మంటల్లో చిక్కుకొని 45 మంది సజీవ దహనం కావడం ఎంతో బాధాకరమని విచారకరమని వారు తెలియజేశారు. మరణించిన వారికి భారత ప్రభుత్వంతో పాటు సౌదీ ప్రభుత్వం కూడా స్పందించి మతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా, నైతికంగా అండగా ఉండాలని కోరారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీపై న్యూ ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షత సాగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ హాజరయ్యారు. సమావేశంలో భాగంగా పిల్లల ఉత్పత్తులు మరోయు ఇతర ఆహార పదార్థాలలో చక్కెర కంటెంట్ పై వినియోగదారుల వ్యవహారాల శాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో కమిటీ చర్చించింది.

ఆర్‌యు చీఫ్ వార్డెన్ రాజీనామా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ పోస్టుకు ఎస్.నరసింహులు ఈనెల 17న సోమవారం రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఇటీవల కాలంలో హాస్టల్లో నెలకొన్న పరిస్థితులు సక్రమంగా లేకపోవడం, అనారోగ్య పరిస్థితుల కారణంగా చీఫ్ వార్డెన్‌గా కొనసాగలేనని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చీఫ్ వార్డెన్‌గా రాజీనామా చేసిన నరసింహులు స్థానంలో మరో ప్రొఫెసర్‌ను నియమించేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది.

21న కాల్వబుగ్గలో వేలం పాట

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 21న కాల్వబుగ్గ రామేశ్వర దేవాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ మద్దిలేటి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో టెంకాయలను అమ్ముకునేందుకు, వాహనాల పార్కింగ్, రెండు అంగళ్లకు, చెప్పుల స్టాండ్‌కు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : రైలు కింద పడి ఒక యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం నగరంలో చోటుచేసుకుంది. సాయంత్రం 4.15 గంటలకు కర్నూలు, దూపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో సుమారు 25 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రైలు నెంబర్ 17253, ఛత్రపతి శంభాజీనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందారు. అతను పింక్ కలర్ ఫుల్ హాండ్ స్వెటర్, తెలుపు కలరు చెక్స్ కలిగిన బ్లూ కలరు షర్ట్, క్రీమ్ కలరు ప్యాంటు ధరించి ఉన్నారు. 5 '6' ఎత్తు, నలుపు రంగు, కుడి చేతిపైన 'అమ్మ' అని పచ్చబొట్టు వేయించుకున్నారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే కర్నూలు రైల్వే పోలీసు వారికి, లేదా కర్నూలు జిఆర్‌పి, రైల్వే పోలీస్ సెల్ నెంబర్లు 9908889696, 9030481295, 9441970940లకు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.కోదండ రాముడు కోరారు.


నేడు వాల్మీకి వనభోజన మహోత్సవం



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం వెంకయ్య పల్లె ఎల్లమ్మ దేవాలయ వద్ద ఉన్న శ్రీనివాస గార్డెన్‌లో బుధవారం నిర్వహించనున్న వాల్మీకి/బోయ కార్తీక వన భోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని టిడిపి వాల్మీకి/బోయ కార్తీక వన భోజనం మహోత్సవ కమిటీ సభ్యులు సత్రం రామకృష్ణుడు, తలారి కృష్ణమ నాయుడు, జక్కం శ్రీనివాసులు, శేఖర్ కోరారు. మంగళవారం వాల్మీకి జిల్లా కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. వాల్మీకి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.

'కపాస్ కిసాన్' యాప్‌తో రైతులకు మేలు : ఎఒ

ప్రజాశక్తి -కోడుమూరు : పత్తి కొనుగోలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సిసిఐ ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు మేలు జరుగుతుందని ఎఒ రవి ప్రకాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని అమడగుంట్ల రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచి వరలక్ష్మి హాజరయ్యారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది బజారి, ఎఇఒ బాలకృష్ణ, సెరికల్చర్ అసిస్టెంట్ సావిత్రి పాల్గొన్నారు.



మైపర్‌లో 64వ ఫార్మసీ వీక్ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని మైపర్ ఆధ్వర్యంలో 64వ నేషనల్ ఫార్మసీ వీక్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మైపర్ బృందం జొహరాపురం గ్రామాన్ని సందర్శించి సమగ్ర టీకా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరపు థీమ్ 'ఫార్మాసిస్టులు-టీకాల పరిరక్షకులు' మేరకు విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తులతో చర్చలు, అవగాహన సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించారు.

15వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాశక్తి - వెల్దుర్తి

పట్టణంలోని 15వ వార్డులో మూడు దశాబ్దాలుగా తాగునీటి సరఫరా, డ్రెయినేజీ కాలువలు, సిసి రోడ్ల సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు ఆదేశాల మేరకు వార్డులో మంగళవారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. టిడిపి మండల అధ్యక్షులు టి.బలరాం గౌడ్ కొత్త పైప్‌లైన్లు, డ్రెయినేజీ కాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తిలో కర్నూలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. తనిఖీల్లో పాఠశాల విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకొని వెళ్తున్న రెండు ఆటోలపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ... వాహనాలకు సరైన పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గార్గేయపురం విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

గార్గేయపురం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులురాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట రాముడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఎస్‌జిఎఫ్ అండర్-14, అండర్-17 ఫుట్‌బాల్, హాకీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వి.వి.పద్మావతిదేవి మాట్లాడుతూ... అండర్-14 ఫుట్‌బాల్ బాలికల విభాగంలో దివ్య, బాలుర విభాగంలో నందిత్, అండర్-17 విభాగంలో మధుమతి, రమ్యశ్రీ, ఉపేంద్ర ఎంపికయ్యారన్నారు. హాకీ అండర్-14లో హిమవంతరావు, మంజుల, అండర్-17లో మమత, యామిని, లక్ష్మణ్ ఎంపికయ్యారని తెలిపారు.

కురువ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగన్న మృతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నాగన్న మృతి సంఘానికి తీరని లోటని రాష్ట్ర కురువ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, గౌరవ సలహాదారులు టి.పాల సుంకన్న, ఉపాధ్యక్షులు కె.ధనుంజయ, కెటి.ఉరుకుందు, బి.వెంకటేశ్వర్లు, కెసి.నాగన్న తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. నాగన్న సంఘానికి, వివాహ పరిచయ వేదిక కన్వీనర్‌గా విశేష సేవలు చేశారని చెప్పారు. జిల్లా కురువ సంఘం నాయకులు తవుడు శ్రీనివాసులు, బి.రామకృష్ణ, కె.రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, దివాకర్, పెద్దపాడు పుల్లన్న సంతాపం వ్యక్తం చేశారు.

డిజిటల్ అరెస్ట్ అంటేనే మోసం : ఎస్పి



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

డిజిటల్ అరెస్టు అంటేనే మోసమని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. డిజిటల్ అరెస్టు పేరుతో పోలీసులమని, సిబిఐ అధికారులమని, ఇతర ప్రభుత్వ అధికారులుగా సైబర్ నేరగాళ్లు నటిస్తూ... వీడియో కాల్స్ చేస్తారని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అవసరమైతే వెంటనే ఆ కాల్స్‌ను కట్ చేయాలని సూచించారు. పోలీసులు ఎప్పుడూ వీడియో, ఆడియో కాల్స్ చేయరన్న విషయం గ్రహించాలన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు కాల్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తే అటువంటి ఫోన్ నెంబర్లను బ్లాక్ చేసి ఆ సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషన్‌లో గానీ లేదా సైబర్ ల్యాబ్ పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు.